క్లుప్తంగా

గజమాలతో సుత్తమ్మతల్లికి అలంకరణ



తగరపువలస: భీమిలి మండలం చిప్పాడ సుత్తమ్మతల్లిని భక్తులు బుధవారం భారీ గజమాలతో అలంకరించారు. ప్రతివారం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరిస్తున్నారు. ఇందులో భాగంగా గజమాలతో భక్తులకు అమ్మవారి దర్శనం కల్పించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

ఘనంగా రాట మహోత్సవం



రాట మహోత్సవంలో పాల్గొన్న భక్తులు

కొమ్మాది: జీవీఎంసీ 4వ వార్డు మంగమారిపేట వద్ద బుధవారం శ్రీ ఎర్నిమాంబ యూత్ బోయ్స్ ఆధ్వర్యంలో వినాయక చవితి రాట మహోత్సవం వైభవంగా నిర్వహించారు. పురోహితులు సతీష్‌శర్మ శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి రాటను ప్రతిష్ఠించారు. అనంతరం నిర్వాహకులు మాట్లాడుతూ వినాయక చవితి ఉత్సవాలు వైభవంగా నిర్వహించనున్నామని, పలు ఆధ్యాత్మిక సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయనున్నామని తెలిపారు.

అన్నప్రసాద పథకానికి లక్ష రూపాయల విరాళం



దాతకు బాండ్ అందజేస్తున్న ఈవో త్రినాథరావు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి బుధవారం నగరంలోని మధురవాడకు చెందిన దండు పద్మనాభరాజు అనే దాత లక్ష 116 రూపాయిలు విరాళం ఇచ్చారు. దేవస్థానం తరపున ఈవో త్రినాథరావు దాతకు బాండ్ అందజేశారు. స్వామివారి దర్శనం కల్పించారు. ఆలయ సూపరింటిండెంట్ సునీల్ పాల్గొన్నారు.

మహిళలకు వైద్య పరీక్షలు



పరీక్షలు చేయించుకుంటున్న మహిళలు

భీమునిపట్నం: పేద వితంతువులకు చేయూత ఇవ్వడానికి నిర్వహిస్తున్న కుటుంబ బలోపేత కార్యక్రమాల్లో భాగంగా భీమిలిలోని ఎస్‌వోఎస్ చిల్డ్రన్స్ విలేజ్ ఆధ్వర్యంలో బుధవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. విశాఖ మెడికవర్ ఆస్పత్రి నుంచి వైద్యులు ప్రసన్న, సాయి, తరుణ్ పాల్గొని బీపీ, షుగర్, ఈసీజీ పరీక్షలు చేశారు. 206 మందికి పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు అందించారు. మెడికల్ టీం ఇన్‌చార్జి వి.కిరణ్‌కుమార్, ఎస్‌వోఎస్ ఆర్గనైజింగ్ మేనేజర్ కె.దుర్గరాజు, ప్రోగ్రాం కో ఆర్డినేటర్లు వి.సత్యనారాయణ, అనన్య దాసు పాల్గొన్నారు.

ఆనందపురంలో ట్రాఫిక్ పద్మవ్యూహం

- భీమిలి క్రాస్ రోడ్డు వరకు నిలిచిపోయిన వాహనాలు



ఆనందపురం ఫ్లై ఓవర్ కింద నిలిచిపోయిన వాహనాలు



మూసుకుపోయిన పువ్వుల మార్కెట్ రోడ్డు



జాతీయ రహదారిపై నిలిచిపోయిన వాహనాలు

ఆనందపురం : ఆనందపురం జంక్షన్‌లో బుధవారం ఎన్నడూ లేనివిధంగా రద్దీ నెలకొంది. వందలాది వాహనాలు ఆనందపురం జంక్షన్‌లో గంటల తరబడి నిలిచిపోవడంతో వాహన చోదకులు, ప్రయాణికులు బెంబేలెత్తిపోయారు. రోడ్డుపై అడుగుతీసి అడుగు వేయలేని పరిస్థితి నెలకొంది. వాహనాలు ముందుకు వెళ్లడానికి గానీ, తప్పు కోవడానికిగానీ ఏ మాత్రం అవకాశం లేకుండా ఈ కూడలి పద్మవ్యూహాన్ని తలపించింది. దీంతో ఆనందపురం జంక్షన్ గుండా ప్రయాణించిన వారు గుండెను అరచేతిలో పెట్టుకొని వెళ్లారు. ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు అదేతంతు కొనసాగింది. ట్రాఫిక్ పోలీసులు నియంత్రించడానికి ప్రయత్నించినా ఫలితం లేకుండా పోయింది.

ఇష్టారాజ్యంగా వాహనాల నిలిపివేతతో...

తగరపువలస, విశాఖ నుంచి వచ్చే వాహనాలు, పెందుర్తి, ఆనందపురం వైపు నుంచి వచ్చే వాహనాలు ఫ్లై ఓవర్ కింద ఉన్న కేవలం 30 అడుగుల రోడ్డు గుండా రాకపోకలు సాగించాల్సి ఉంది. అలాగే పెందుర్తి రోడ్డుని ఆనుకునే వేములవలస రోజు వారీ మార్కెట్ ఉంది. దీంతో శ్రావణమాసం సందర్భంగా వస్తువులు, పువ్వుల కొనుగోలుకు వేలాది మంది వేకువజామునే మార్కెట్‌కు చేరుకున్నారు. వందలాది వాహనాలను ఎక్కడబడితే అక్కడ నిలిపి వేశారు. అలాగే ఇదే రూట్లోకి నాలుగు వైపుల నుంచి వచ్చే వందలాది వాహనాలు ఒకేసారి ఫ్లై ఓవర్ కింద రూట్లోకి ప్రవేశించడంతో తీవ్ర గందరగోళం నెలకొంది. ఒక దశలో ఎక్కడి వాహనాలు అక్కడే రోడ్డుపై నిలిచిపోయాయి. భీమిలి క్రాస్‌రోడ్డు వరకు సుమారు కిలో మీటరున్నర దూరం వరకు జాతీయ రహదారిపై వాహనాలు నిలిచి పోయాయి. ఇలా మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఈ మార్గంలో ప్రయాణించిన వారు నరకం చూశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఇక్కడ ట్రాఫిక్ నియంత్రణపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందని పలువురు అంటున్నారు.

బాలుడి వైద్యానికి దాతల చేయూత

- 'సాక్షి' కథనానికి స్పందించి రూ.52 వేల సాయం

ఆనందపురం : ఆనందపురం కాలనీలో నివసిస్తున్న నిరుపేద కుటుంబానికి చెందిన బాలాజీ (4) అనే బాలుడు బ్లడ్ క్యాన్సర్‌తో బాధపడుతున్న వైనంపై ఈ నెల 22న 'పేద కుటుంబానికి పెద్ద కష్టం' శీర్షికతో సాక్షిలో ప్రచురితమైన కథనానికి పలువురు దాతలు స్పందించారు. ఈ మేరకు సాయం చేయడానికి ముందుకొచ్చారు. విద్యుత్ శాఖలో పని చేస్తున్న కాలనీకి చెందిన యువత రూ.10 వేలు, ఏనుగులపాలేనికి చెందిన కొట్యాడ గోపి, అనురాధ దంపతులు రూ.5 వేలు బాధిత కుటుంబానికి అందజేశారు. అలాగే వార్తా కథనానికి స్పందించి చాలా మంది ఫోన్ పే ద్వారా ఆర్థిక సాయం అందించారు. ఇంత వరకు రూ.52 వేలు సాయం అందింది. దీంతో బాధిత కుటుంబానికి కొంత ఓదార్పు లభించింది. బాలుడికి అవసరమైన మందులు తల్లిదండ్రులు కొనుగోలు చేస్తున్నారు. సాయం చేయదలచిన దాతలు 9052782447లో సంప్రదించాలని జై జవాన్ ఫౌండేషన్ ఉపాధ్యక్షుడు ఎం.శ్రీను కోరారు.

ఓటర్ల జాబితా పరిశీలన 87 శాతం పూర్తి



సమావేశంలో ఓటర్ల నమోదు అధికారి భాస్కరరెడ్డి, తదితరులు

భీమునిపట్నం: భీమిలి పరిధిలో ఇంటింటికీ వెళ్లి ఓటర్ల జాబితాల పరిశీలన 87 శాతం పూర్తయినట్టు నియోజకవర్గ ఓటర్ల నమోదు అధికారి, ఆర్‌డీవో ఎస్.భాస్కరరెడ్డి తెలిపారు. బుధవారం సాయంత్రం వివిధ పార్టీల నాయకులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని ప్రాంతాల్లోనూ బీఎల్‌వోలు, బీఎస్‌ఏలు ఎంతో జాగ్రత్తగా జాబితాలను పరిశీలించారన్నారు. స్థానికంగా నివసించని, మృతి చెందిన వారి ఓట్లు తొలగించి.., కొత్తవారివి చేర్చారని తెలిపారు. త్వరలో జాబితా పరిశీలన శతశాతం పూర్తవుతుందని తెలిపారు. నాయకులు అల్లిపిల్లి నర్సింగరావు, ఎస్.కరుణాకరరెడ్డి, గంటా నూకరాజు, చంద్రరావు, ఎన్నికల డీటీ భాస్కరరావు పాల్గొన్నారు.

యూటీఎఫ్ నూతన కార్యవర్గం



యూటీఎఫ్ నూతన కార్యవర్గ సభ్యులు

పద్మనాభం: పద్మనాభం మండల యూటీఎఫ్ అధ్యక్షునిగా ఎస్.నారాయణరావు బుధవారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గౌరవ అధ్యక్షునిగా బోని చిన్నారావు, ప్రధాన కార్యదర్శిగా కోలా సన్యాసిరావు, కోశాధికారిగా ఎంవీవీ సత్యనారాయణ రెడ్డి, జిల్లా కౌన్సిలర్‌గా పి.వి.రమణ ఎన్నికయ్యారు. అనంతరం కమిటీతో యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి ఉప్పాడ రాము ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలకు పెను ప్రమాదంగా తయారైన 117 జీవోను రద్దు చేయాలని కోరారు. పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని కోరారు. కృష్ణాపురం కాలనీ ప్రాథమిక పాఠశాల ఆవరణలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆర్.వి.నారాయణ, సీహెచ్ ప్రభాకర్, దెందేటి రాజు పాల్గొన్నారు.

4వ వార్డులో ఫాగింగ్

కొమ్మాది: డెంగ్యూ, మలేరియా నియంత్రణకు చేపడుతున్న చర్యల్లో భాగంగా జీవీఎంసీ 4వ వార్డులో మలేరియా నివారణ విభాగం ఆధ్వర్యంలో రెండు రోజుల నుంచి ఫాగింగ్ ప్రక్రియ చేపట్టారు. తిమ్మాపురం, మంగమారిపేట, ఉప్పాడ, కాపులుప్పాడ, కె.నగరపాలెం ప్రాంతాల్లో జీవీఎంసీ మలేరియా నివారణ విభాగం ఇన్‌స్పెక్టర్ సూరిబాబు పర్యవేక్షించారు. దోమల వ్యాప్తి తగ్గించడానికి సాయంత్రం వేళల్లో చేస్తున్న ఫాగింగ్ ఉపయోగపడుతుందని, ఇళ్ల పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని ఆయన సూచించారు.

జాబిల్లిపై జాతీయ పతాకం రెపరెపలు



వేడుకల్లో రాయప్పాలెం జీవీఎంసీ హైస్కూల్ విద్యార్థులు



చంద్రంపాలెం హైస్కూల్లో వీక్షిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు



అంబేడ్కర్ కూడలి వద్ద విజయోత్సవ ర్యాలీలో విద్యార్థులు

తగరపువలస: చంద్రయాన్ – 3 ప్రయోగంలో భాగంగా విక్రమ్ ల్యాండర్ జాబిల్లి దక్షిణ ధ్రువంపై విజయవంతంగా అడుగుపెట్టిన సందర్భంగా జీవీఎంసీ రెండో వార్డు రాయప్పాలెం హైస్కూల్ విద్యార్థులు పాఠశాలలో వేడుకలు జరుపుకున్నారు. చంద్రయాన్ విజయవంతం కావడం మనందరికీ గర్వకారణమని ప్రధానోపాధ్యాయురాలు జయంతి రాధాకుమారి అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు చంద్రయాన్ నమూనాలు తయారు చేసి జాతీయ జెండాతో ప్రదర్శనలు చేశారు.

చంద్రునిపైకి ఇస్రో ప్రయోగించిన చంద్రయాన్ – 3 విజయవంతంపై భీమిలి జోన్ ఒకటో వార్డు రామన్నపేట సాయిరవీంద్ర స్కూల్ విద్యార్థులు బుధవారం సాయంత్రం విజయోత్సవాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ బోగెల కృష్ణ మాట్లాడుతూ చంద్రుని దక్షిణ ధ్రువంపై భారతదేశమే తొలిసారి కాలు మోపిందన్నారు. ప్రిన్సిపాల్ వాండ్రాసి సతీష్, ఉపాధ్యాయులు ర్యాలీ నిర్వహించారు.

భీమునిపట్నం: చంద్రయాన్ ల్యాండింగ్‌ను స్థానిక కస్తూర్బా గాంధీ విద్యాలయం విద్యార్థినులు బుధవారం సాక్షి టీవీలో వీక్షించారు. విక్రమ్ ల్యాండర్ సురక్షితంగా ల్యాండ్ అవడంతో హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. ఏపీసీ శ్రీనివాసరావు, జీసీడీవో కలేషాబేగం, ప్రిన్సిపాల్ గంగాకుమారి పాల్గొన్నారు.

మధురవాడ: చంద్రయాన్ విజయవంతంగా జాబిల్లిపై ల్యాండింగ్ కావడాన్ని మధురవాడలోని వివిధ ప్రాంతాల్లో ప్రభుత్వ సంస్థలు, విద్యా సంస్థల్లో ఆసక్తిగా తిలకించారు. చంద్రంపాలెం హైస్కూల్‌లో బుధవారం సాయంత్రం చంద్రయాన్ ప్రయోగం వీక్షించేందుకు ఏర్పాట్లు చేశారు. ఈ ప్రయోగం విజయవంతంతో భారతదేశ ఖ్యాతి విశ్వవిఖ్యాతం అయిందని ప్రధానోపాధ్యాయుడు రాజబాబు చెప్పారు.

విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలి



కార్యక్రమంలో ప్రిన్సిపాల్, ఇతర అధ్యాపకులు

భీమునిపట్నం: ఛాత్రోపాధ్యాయులు ఉపాధ్యాయులుగా బాధ్యతలు చేపట్టిన తర్వాత విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పి ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలని జిల్లా విద్య శిక్షణ సంస్థ (డైట్) ప్రిన్సిపాల్ ఎల్.సుధాకర్ అన్నారు. ఇక్కడ 2021 – 23 బ్యాచ్ విద్యార్థులు శిక్షణ పూర్తి చేసుకున్న సందర్భంగా బుధవారం వారికి నిర్వహించిన వీడ్కోలు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఉపాధ్యాయ వృత్తి ఎంతో బాధ్యతతో కూడుకున్నదని, దానికి ఉన్న విలువను ప్రతి ఒక్కరూ నిలబెట్టాలని సూచించారు. డైట్ కళాశాలకు ఎంతో చరిత్ర ఉందని, ఎందరో గొప్ప వారు ఇక్కడి నుంచి వెళ్లారని, వారిలాగే ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థినులు ప్రదర్శించిన నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. వైస్ ప్రిన్సిపాల్ గొట్టేటి రవి, అధ్యాపకులు ఎం.మహాలక్ష్మి, పి.హరిణి, సోమయాజులు, జె.మాధవి, ఎస్.త్రినాథరావు పాల్గొన్నారు.

పైప్‌లైన్లకు మరమ్మతులు విజయవంతం



సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహం వద్ద పూర్తయిన మరమ్మతులు

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్‌లో లీకవుతున్న తాగునీటి పైప్‌లైన్లకు బుధవారం విజయవంతంగా మరమ్మతులు పూర్తి చేశారు. ఇందుకోసం భీమిలి మండల పరిధిలోని ఇంజినీరింగ్ సిబ్బందిని కూడా వినియోగించారు. పైప్‌లైన్ నిర్మాణంలో లోపాల కారణంగా కొంతకాలంగా గ్లాస్ రీయిన్‌ఫోర్స్‌డ్ కాంక్రీట్ పైపులు లీకవుతూ పలుచోట్ల రహదారులు చెరువులుగా మారుతున్న సంగతి తెలిసిందే. దీనిపై ప్రతీసారి ప్రజల నుంచి వస్తున్న విమర్శలను సవాల్‌గా తీసుకున్న సిబ్బంది ఎట్టకేలకు పూర్తి స్థాయిలో మరమ్మతులు పూర్తి చేయగలిగారు. గురువారం వీటికి ట్రయల్ నిర్వహించి మిగిలిపోయిన లోపాలను సవరించనున్నట్టు సిబ్బంది తెలిపారు.

మాజీ సైనికుడిపై దాడి



సంగివలస ఆస్పత్రిలో ఆదినారాయణను పరామర్శిస్తున్న మాజీ సైనికులు

పద్మనాభం: మండలంలోని రేవిడి పంచాయతీ రౌతులపాలెంలో మాజీ సైనికుడిపై గుర్తు తెలియని వ్యక్తులు మంగళవారం దాడి చేయడంతో కేసు నమోదు చేసినట్టు సీఐ ఎస్.సన్యాసినాయుడు తెలిపారు. సీఐ అందించిన వివరాల ప్రకారం... రౌతులపాలెం గ్రామానికి చెందిన మాజీ సైనికుడు మోపాడ ఆదినారాయణ (38) మంగళవారం బైక్‌పై విశాఖపట్నం వెళ్లారు. తిరిగి అదే రోజు రాత్రి 9 గంటల సమయంలో రౌతులపాలెం వస్తుండగా గ్రామానికి సమీపంలో రోడ్డు పక్కన ఉన్న గుర్తు తెలియని వ్యక్తులు ఆదినారాయణపై కర్రలు, రాడ్లతో దాడి చేశారు. బాధితుని కేకలు విని స్థానికులు ఘటనా స్థలికి చేరుకోగా... దాడి చేసిన వ్యక్తులు పారిపోయారు. అయితే కోన రమణకు, తనకు భూ తగాదాలు ఉండడంతో... రమణే తనపై దాడి చేయించాడని మాజీ సైనికుడు ఆదినారాయణ అనుమానం వ్యక్తం చేశాడు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.

బాధితునికి మాజీ సైనికుల పరామర్శ

తగరపువలస: మాజీ సైనికుడు మోపాడ ఆదినారాయణను బుధవారం సాయంత్రం భీమిలి మాజీ సైనికులు సంగివలస అనిల్ నీరుకొండ జనరల్ ఆస్పత్రిలో పరామర్శించారు. దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. భీమిలి మాజీ సైనికుల సంఘం అధ్యక్షుడు కొయ్య గురయ్యరెడ్డి, కార్యదర్శి చేట్ల తాతయ్యరెడ్డి, వెంపాడ రమణ, నందిక రమణ, కొండపు శ్రీనివాసరెడ్డి, కె.రాజన్నరెడ్డి, కొయ్య సూర్యనారాయణ, కొయ్య శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రకేసరి టంగుటూరికి ఘన నివాళి



టంగుటూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎంపీపీ వాసురాజు, తదితరులు



టంగుటూరి ప్రకాశం పంతులు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న చిన్నబాబు తదితరులు

ఆనందపురం : స్వాతంత్ర్య సమరయోధుడు, ఆంధ్ర రాష్ట్ర ప్రథమ ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతిని మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ప్రకాశం పంతులు సేవలను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో అడపా లవరాజు, మజ్జి వెంకటరావు, సూపరింటిండెంట్ ఏవీఎస్ నాగేశ్వరరావు, మండల ఇంజినీరు బట్టు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

భీమునిపట్నం: ఆంధ్ర రాష్ట్ర ప్రథమ ముఖ్యమంత్రి ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి సందర్భంగా బుధవారం ఇక్కడి మండల పరిషత్ కార్యాలయంలో ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఎంపీపీ దంతులూరి వాసురాజు మాట్లాడుతూ ప్రకాశం పంతులు ప్రజల మన్ననలు పొందే విధంగా పాలన సాగించారని కొనియాడారు. ఎంపీడీవో వెంకటరమణ, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు. అలాగే వ్యవసాయ మార్కెట్ కమిటీ వద్ద చైర్మన్ యలమంచిలి సూర్యనారాయణ ఆధ్వర్యంలో సిబ్బంది ఘనంగా నివాళులర్పించారు.

కొమ్మాది: రుషికొండలో గల గిరిజన సాంస్కృతిక పరిశోధన, శిక్షణ సంస్థ భవన్‌లో బుధవారం ఆంధ్ర రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముందుగా టంగుటూరి చిత్రపటానికి డీఈ చిన్నబాబు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అలనాటి నాయకుల మార్గదర్శకాలను నేటి నాయకులు స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో శిక్షణా సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

గుజ్జు రామునాయుడు భవనం పునఃప్రారంభం



మాట్లాడుతున్న లేబర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఈశ్వరరావు

తగరపువలస: భీమిలి డివిజన్ ఏఐటీయూసీ, సీపీఐ, చిట్టివలస లేబర్ యూనియన్ కార్యక్రమాలకు ప్రధాన వేదికైన గుజ్జు రామునాయుడు భవనాన్ని, అందులోని విభాగాలను బుధవారం పునఃప్రారంభించారు. ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి పడాల రమణ, సీపీఐ జిల్లా కార్యదర్శి మరుపిల్ల పైడిరాజు వేర్వేరు కార్యాలయాలను ప్రారంభించారు. లేబర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కొండపు ఈశ్వరరావు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో నాయకులు మాట్లాడుతూ చిట్టివలస జ్యూట్‌మిల్లు సమస్యలు, భీమిలి నియోజకవర్గ ప్రజలు, అసంఘటిత రంగ కార్మికుల సమస్యలను ఇప్పటి వరకు ఈ మూడు సంఘాలు సమర్థవంతంగా పరిష్కరించాయన్నారు. భవిష్యత్తులో కూడా వీరికి తమ అండ ఉంటుందన్నారు. 67 ఏళ్ల క్రితం నిర్మించిన చరిత్రాత్మక భవనాన్ని గత అయిదు మాసాలుగా పునరుద్ధరించినట్టు తెలిపారు. కమ్యూనిస్టుల త్యాగాలకు ఈ గుజ్జు రామునాయుడు భవనం సాక్ష్యంగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో అల్లు బాబూరావు, తూతిక సోమరాజు, మావూరి సన్యాసమ్మ, మోర అప్పలరాజు, కాసూరి రాంబాబు, చిల్ల రాంపైడి, ఎరుసు అప్పలనరసయ్య, నూలు ఆదినారాయణ, డెక్కతి సూరిబాబు, చిల్ల వెంకటరమణ, మద్ది నారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పిలకవానిపాలెంలో రూ.9.9 లక్షలతో సీసీ రోడ్డు



పిలకవానిపాలెంలో సీసీ రోడ్డు పనులు పరిశీలిస్తున్న పోతిన శ్రీనివాసరావు తదితరులు

మధురవాడ: ఏళ్ల తరబడి పూర్తి కాని పనులకు గడప గడపకు మన ప్రభుత్వం నిధులతో ఎట్టకేలకు మోక్షం లభిస్తోంది. ఈ మేరకు జీవీఎంసీ 7వ వార్డు పిలకవానిపాలెంలో రోడ్లు లేక స్థానికులు పడుతున్న ఇబ్బందులను ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు దృష్టికి వైఎస్సార్ సీపీ వార్డు అధ్యక్షుడు పోతిన శ్రీనివాసరావు తీసుకెళ్లడంతో అధికార యంత్రాంగం రోడ్డు నిర్మాణానికి పూనుకుంది. పిలకవానిపాలెంలోని విజయం స్కూలు నుంచి మిథిలాపురి వుడా కాలనీ రోడ్డు వరకు సుమారు 100 మీటర్ల మేర సీసీ రోడ్డు పనులు రూ.9.9 లక్షల నిధులతో ప్రారంభమయ్యాయి. పనులను పోతిన శ్రీనివాసరావు, ఇంజినీరింగ్ విభాగ అధికారులు బుధవారం పరిశీలించారు.

అక్టోబర్ 5 నుంచి మూట్ కోర్టు పోటీలు

కొమ్మాది: గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ లా ఆధ్వర్యంలో ఈ ఏడాది అక్టోబర్ 5వ తేదీ నుంచి 8 వరకు జాతీయ స్థాయి మూట్ కోర్టు పోటీలు వర్చువల్‌గా నిర్వహించనున్నట్టు డైరెక్టర్ ప్రొఫెసర్ అనితారావు తెలిపారు. గీతం మూట్ అండ్ అడ్వకసీ కమిటీ ఆధ్వర్యంలో గీతం వ్యవస్థాపక అధ్యక్షులు ఎంవీవీఎస్ మూర్తి పేరుతో గత మూడు సంవత్సరాలుగా ఈ పోటీలను ప్రముఖ న్యాయ నిపుణుల పర్యవేక్షణలో నిర్వహిస్తున్నామన్నారు. ఈ ఏడాది మూట్ కోర్టు పోటీల్లో న్యాయ విద్యార్థులు చర్చించాల్సిన అంశం గురించి గీతం మూట్ కోర్టు పోటీల వెబ్‌సైట్‌లో పరిశీలించవచ్చన్నారు. పోటీల్లో విజేతలకు ప్రథమ బహుమతిగా రూ. 50వేలు, ద్వితీయ బహుమతిగా రూ. 20 వేలు, ప్రశంసాపత్రాలు అందజేస్తామన్నారు. పోటీల్లో పాల్గొనేందుకు సెప్టెంబర్ 15లోగా వివరాలను వెబ్‌సైట్ ద్వారా రిజిస్టర్ చేసుకోవాలని సూచించారు.